పెండ్లిసంబంధం

> మావారు మొన్న క్రిస్టమస్ (1936) సెలవులలో యింటికివచ్చినప్పుడు మాటల్లో "ఏమే మధూ! నాకు పెండ్లిసంబంధం వచ్చినది. తెలుసునా" అన్నారు. నేను గాభరాపడి" ఏమిటండోయి! నే నేమిటికావడం." అన్నాను. వారు దానితో నవ్వి "ఎబ్బే ఇంకా చేసుగోడం లేదు. అసలు సంగతి చెప్పతా విను" అన్నారు.

అగస్టులో నేను డార్కురూములోకివెళ్లి ప్రాక్టికల్ చేసుకుంటూంటే మా నరసింహామూర్తివచ్చి "ఏమోయి కృష్ణా, సిద్ధంగావుండు" అన్నాడు. "ఏమిటోయి" అని వెనక్కుతిరిగిచూస్తే అతను వెళ్లిపోయినాడు. ఒకటిరెండునిముషాల్లో ఒకపంతులు గదిలో ప్రవేశించినాడు. సుమారు 40 సంవత్సరాలుంటాయి. తెల్లపడుతూంది జుత్తు. ఒక ఖద్దరుపంచ. శిల్కుషర్టు. సేలంఅంచు వుత్తరియ్యం. నే నొక్కడినే వున్నాను గదిలో. నాదగ్గరకువచ్చి "మీ రేనాఅండి కృష్ణమూర్తిగారు" అన్నాడు. "ఔ" నన్నాను.

"ఎబ్బే ఏమీలేదు. మాది కాకినాడదగ్గర రామచంద్రపురం. మీనాన్నగారిని యెరుగుదును. కాలేజి చూడటానికివచ్చాను. పనిలోపని. మిమ్మల్నిచూచిపోదా" మనుకున్నాను.

"సరేలేండి. మీ పేరేమిటో చెపితే మానాన్నగారికి మీరువచ్చి చూచివెళ్లినట్లు వ్రాస్తా" నన్నాను.

"నాపేరు రామకృష్ణశాస్త్రి. మా యింటిపేరు యెడవల్లివారు. మీనాన్నగారిని నేనుచూచి పదియేండ్లవుతుంది. వారికి జ్ఞాపకంవుందో లేదో గాని నాకు మాత్రం చాలాబాగా జ్ఞాపకంవుంది. అసలుసంగతి యేమిటంటే మాబావమరది 1926 పారిపోయాడు చెప్పకుండా. అప్పుడు మావూళ్లో ఒక వకీలుగారిచేత మీనాన్నగారికి వ్రాయించాను బందరువచ్చినట్టువిన్నానని కనుక్కోమని. వారుచూచి అతన్నిపంపించారు. పైగా వాడిదబ్బెపోతే రైలుఖర్చుకి వారు మూడురూపాయలుగూడా యిచ్చారుట. తర్వాత ఆయేడే మద్రాసుకాంగ్రెసుకు మీనాన్నగారు వాళ్లు బయల్దేరారు. నేను మావూరినుంచి వుత్తరంవ్రాసిన వకీలుగారు కొంతమందిగూడా ఆపెట్టె ప్రక్కపెట్టెలోనే ప్రయాణంచెయ్యడం తటస్థించినది. వారు ఇంటరుక్లాసులోనున్నారు. మేము 'గాంధీ క్లాసు' లో నున్నాము. గూడూరులో కాఫీతాగుతూంటే మీనాన్నగారికి మా వకీలుగారు ఇంట్రడ్యూస్ చేసినారు. మా బావమరది సంగతి మరీ మరీ అడిగినారు. మీ నాన్నగారు చాలవుదారహృదయులు. తర్వాత మళ్లీ చూడలేదు. వారిని చూడవలెననివుంది. మీరు హాస్టలులో వున్నారా వూళ్లోవున్నారా" అని పురాణం ఆపాడు.

"నేను వూళ్లో ఒక రూములో వున్నాను. హాస్టల్లో చేరలేదు."

ఈయన యింకా నన్ను వదలలేదు. మా నరసింహామూర్తి వచ్చి "ఒంటిగంట దాటింది. టిఫిన్ చేసొద్దాంరావోయి మీరుగూడరాండిసర్" అన్నాడు. ముగ్గురు అక్కడ టిఫిన్ తిని కాఫీతాగి కాలేజికి వచ్చాం. ఆయన వెళ్లిపోయేవాడు వెళ్లిపోకుండా అన్నాడుగదా "నేను అయిదుగంటలకు మళ్లీ యిక్కడకు వస్తాను. మీ రూముకు వస్తాను. అంతాకలిసి వెళ్దాంలేండి" అని. నరసింహామూర్తినిగూడ పిలిచి వెళ్లిపోయాడు.

నేను నరసింహామూర్తితో "ఏమోయ్ ఈపంతులును నీకేంతెల్సు" అన్నాను. "లైబ్రరీలో నేను పేపరుచూస్తుంటే. ఏమండీ మీక్లాసులో ఏవరైనా తెలగాణ్యులున్నారా" అన్నాడు యీయనవచ్చి.

కొద్దిగా తమాషా చేయవచ్చునని నీపేరు చెప్పాను. మీ తండ్రిపేరు గూడా అడిగివెళ్లాడు. దానిమీద ఊహ – ఊకదంపు, సాయంత్రం ఆయనతో నీరూముకు వస్తానోయి. లైటుహౌసు సినీమాలో ఇన్విసిబుల్ మాన్ వుంది" అన్నాడు. "సరే లేవోయి" అన్నాను.

౨

ఆరోజు నాకు రిజల్టురాలేదు. నాలుగుముప్పావుకే దిగాడు రామకృష్ణశాస్త్రిగారు శనిగ్రహంలాగు, నరసింహమూర్తిగూడ ప్రాక్టికల్ కట్టిపెట్టి బయల్దేరాము బండీచేసుకుని ముగ్గురం. నరసింహమూర్తి హాస్టల్లోవాడైనా వచ్చేశాడు వూళ్లోకి. మొహాలు కడుక్కుని బయల్దేరాము కాఫీదేవాలయానికి.

ఏదోఇంత కడుపులో వేసుకొని బీచికి దారితీశాం. వాళ్లవూళ్లో ఆయన కరణంగావున్నారనీ, ప్రస్తుతం ఒకనెలరోజులు సెలవుతో రామచంద్రపురంలో వున్నారనీ తెలిసింది. వాళ్లవూళ్లో దశరావుత్సవాలు చేస్తారనీ చాలబాగుంటుందనీ, పైగా భోగంమేళం రాజమండ్రినుంచి తెప్పిస్తారనీచెప్పారు. మేమిద్దరు సెలవులలో వెళ్లేటప్పుడు అక్కడదిగి వెళ్లవలసిందనీ, ఒకరోజుమాత్రమన్నా వుండవలసిందనీ ఒక సజెషన్ పారేశాడు. ఎల్లుండి దశరాఅనగా తనకు యిక్కడ పనుందనీ తనేవచ్చి మమ్ములను తీసుకువెళ్లుతాననీ చెప్పాడు. 'సరేలెండి' అన్నాడు మా నరసింహమూర్తి మాటవరసకు. గంట ఆరుంబావుఅయింది. ముగ్గురంకలిసి బీచిమీదనున్న లైటుహౌసు సినీమాకు వెళ్లాం. ఇంటికిరాగానే ముగ్గురం నా లాడ్జిలోనే భోంచేశాం. ఆయన వాళ్లస్నేహితుని కల్లిపోయినాడు నేనూ మావాడు మిగిలాం.

"ఏమోయి కృష్ణా యీయనవొక పెద్దదబ్బాలా వున్నాడు. అంతా అరవగోడులావుంది. ఏమిటి అయితే మైకేల్మసులో మనం రామచంద్రపురం వెళ్లుదామా?"

"ఏమిటో లేవోయి, ఆయనవస్తేగా. తర్వాత మాట. మర్యాదకు అనుంటాడు. నాకు అయితే రామచంద్రపురం సామర్లకోట దగ్గరేకాబట్టి వెళ్లే దారిలో దిగవచ్చును. నువ్వెట్లావస్తావు. విజయనగరంనుంచి మీ ఆవిడ వారానికిరెండుసార్లు వైర్లెను మెస్సేజెను పంపుతూంటే. ఇంతకు మనం అక్కడకు వెళ్లితే డి.పి.ఏనా లేక ఏమిటిసంగతి."

"ఈడబ్బాగాడి సంగతేమిటో కనుక్కోవాలోయి. నేనూవస్తాను. కోనసీమచూచి ఆరేళ్లయింది."

"సరేలే మళ్లీ ఆయనవచ్చినాక చూచుకోవచ్చు. నాకు నిద్రవస్తూంది. లైటాఫ్‌చెయ్యి పడుకుందాం."

"జాగ్రత్తోయ్ ఇన్‌విజిబుల్‌మాన్ వస్తాడేమో?"

3

శుక్రవారంనుంచి దశరాసెలవులు. బుధవారం సాయంత్రం, టెన్నిసుఆడుతున్నాను. నరసింహమూర్తి టెన్నిసుఆడి దగ్గరకు వచ్చాడు. సినీమాకు వెళ్లుదామని యిద్దరం ప్లానువేశాం. సెట్టుఅయింది. ఇద్దరం సైకిల్సుయెక్కాం. ఇంతలో వెనుకనుంచి పిలుపువచ్చింది, చప్పట్లతో. ఇంకా ఎవరైనా స్టూడెంట్సు సినీమాకువస్తారేమోనని వెనక్కు తిరిగాము. బండీ, బండీలో రామకృష్ణశాస్త్రిగారు. సరేఅని సైకిల్సుదిగాం. "ఏమిటి ఐదున్నరకి యెట్లా వచ్చారు" అంటే మెయిలు లేటయిందనీ అందులో వచ్చాననీ చెప్పాడు. రాత్రి సినీమాకు భోజనానికి మాకాయనగెస్టు. ప్రొద్దున్నేనిద్దర నాలుగున్నరకే లేచాం. సూటుకేసు – బెడ్డింగుహోల్డరు నేను ప్యాకు చేసుకున్నాను. నరసింహమూర్తిమాత్రము నాతోనే వచ్చాడువూరికే. ఆరున్నరకు స్టేషనుకువచ్చాం.

మాశాస్త్రిగారు టెలిగ్రాము యిచ్చివచ్చారు ఎక్కడికో వెళ్లి. బహుశః మేంవస్తున్నామని యేమన్నాయిచ్చారేమో! ఇంత టిఫిన్ తిని రైల్లో రైలు

దేరాము. ఎంతయినా రైల్లో చాలకులాసాగా గడచింది. సామర్లకోటలో టిఫిన్ తిన్నాం. రామచంద్రపురం వెళ్లేటప్పటికి పాతికతక్కువ పన్నెండుఅయింది. ఆయనకొడుకున్నూ (16 ఏళ్లుంటాయి పిలక, కళ్ళజోడు, చెప్పులు, పైజామా,) ఆయన బావమరదిన్నీ స్టేషనుకువచ్చారు. ఇతనే ఇక్ష్వాకులనాడు తప్పిపోయిన బావమఱది. వాళ్లను మాకుఆయన ఇంట్రడ్యూస్ చేశాడు. మేమెవరమో వాళ్లకు సరిగ్గా తెలీదనుకుంటూ.

ఇంటికివెళ్లి కాళ్లుకడుక్కునేటప్పటికి పన్నెండు దాటింది. కడుపులో ఎలికలు దూరినాయి. ఎంత సామర్లకోటలో అయ్యరుకు ఇచ్చేసినా, వెధవది, ఆకలిమాత్రం మళ్లీ తిరిగివచ్చేసింది. స్నానాలుచేసి భోజనంచేసేటప్పటికి ఒంటిగంటన్నరఅయింది. హాయిగాకొంతసేపు నిద్రపోయిలేచి ఇద్దరం మొహం కడుక్కున్నాము. ఇంతలో శాస్త్రిగారబ్బాయి వచ్చి "టిఫినుపుచ్చుకోరూ" అన్నాడు, అప్పుడు ఒక చింపాన్జీ జ్ఞాపకంవచ్చింది నాకు. కాఫీహోటలులో మూడురోజులనుంచి ఖర్చుగాని జిలేబి, ఇంట్లో చేసిన కారంపూస, తెల్లటిపానకం కాఫీవచ్చాయి. ఏదో పుచ్చుకున్నాం.

౪

శాస్త్రిగారి తల్లిటవచ్చింది. అరవయ్యేళ్లుంటాయి. నిలువుగానేవుంది. ఆవిడ లెక్చరు మొదలెట్టింది.

"ఏం నాయనా మీరు యింతత్వరగా అనుకోకుండా మాయింటికి వస్తారనుకోలేదు. ఏమిటో మావాడు వాడి వెఱ్ఱిధోరణిలో విశాఖపట్టణం వెళ్లడం వాడికి మీరు అక్కడ కనబడ్డం నిజంగా దైవఘటనయే నాయనా. మీరిద్దరూ ఒక టేచదువుతున్నారా నాయనా!"

"ఔనండి" అన్నాడు మా నరసింహామూర్తి.

"ఏమే సుందరమ్మా మనశ్యామలను వీరికి కాస్త ఫిడేలు వినపించమనరాదులే? కష్టపడి రాకరాక వచ్చారు" అంది.

ఇంతలో చాకలివాడు ఫిడేలుతెచ్చి అక్కడ పెట్టాడు. తల్లీకూతురువచ్చారు. అవ్వగారు మళ్లీ అందుకుంది.

"నాయనా యీశ్యామల నా మనమరాలు. నేనో సుందరమ్మో యెత్తుకోడమేగాని యెప్పుడు కింద కాలుబెట్టలేదు."

"ఊరుకో వేమమ్మా నువ్వెప్పుడూయింతే" అంది అమ్మాయి.

"దీన్ని స్కూలులోవెయ్యలేదు. అక్కడ సరిగ్గా చెప్పతారో చెప్పరో అని ఇంట్లోనే ప్రైవేటు చెప్పిస్తున్నామునాయనా. ఇంగ్లీషువుండాలని మా అబ్బాయి పోరాట్టంవల్ల ఏదో ఒకఅబ్బాయి చెప్పతున్నాడు. ఏదో క్లాసుపుస్తకం. గడగడా చదివేస్తుందినాయనా. తెలుగులో మనకావ్యాలెన్నున్నాయో అన్నీ కంఠాపాఠం. ఏదీ ఎంతలెక్కపెట్టినా రత్నాక్షిలోపుట్టిందేగా ఇది. ."

ఇంతలో శాస్త్రిగారువచ్చారు. "ఏమిటో మీరు పిల్లని పాడనిస్తారా మీగోడేనా" అన్నారు. గొడవ తగ్గింది.

సరే అమ్మాయి సరిగమలు వాయించి తల్లివేపు చూసింది. "బ్రోచేవారెవరురా!" అని వాయించమంది తల్లి. బాగానేవుంది. అవ్వగారు "ననుపాలింపగ నడచివచ్చితివా" వాయించమన్నారు. అదీ అయిందనిపించింది. సరే తల్లీ కూతురు లోపలకు వెళ్లారు. అవ్వగారు కూడ కాస్సేపటిలో పీఠం ఎత్తారు.

పాట బాగానేవుంది. నామట్టుకు నాకు ఇదంతా ఒక అరవగోడులాగుంది.

గృహలక్ష్మి

రాత్రి భోజనాలవేళయింది. అక్కడ నరసింహమూర్తి యోగక్షేమం నా యోగక్షేమం చర్చింపబడ్డాయి. నావుద్దేశం కట్నం తీసుకోవాలనా వొద్దనా అని అడిగారు. నరసింహమూర్తి ఇస్తే పుచ్చుకోవాలన్నాడు. నేను అసలు పుచ్చుకోగూడదన్నాను. సరే భోంచేసి పడుకున్నాం. నిద్రలేచి బయల్దేరాం. కాఫీ తీసుకు రైలుకువచ్చాం. శాస్త్రిగారు స్టేషన్కు వచ్చారు.

"అమ్మాయి ఎట్లా పాడింది' అన్నారు. నేను మట్టుకు ఒక మాస్టరులాగ "చాల శ్రావ్యంగా పాడింది కృషిచేస్తే యింకా బాగవుతుంది" అన్నాను.

"ఏదీ. ఈయేడాదిలో బాగుపడుతుంది లెండి. సరేగాని యీసంగతే మీనాన్నగారితో మాట్లాడు దామనివుంది" అన్నాడు చల్లగా.

"ఏవిషయం" అన్నాను సీరియస్గా.

"యీ సంబంధంవిషయం" అని అప్పటికి బయట పెట్టాడు అసలుసంగతి శాస్త్రుల్లుగారు. సరే మా నరసింహామూర్తి తగులుకున్నాడు దాంతో.

"ఏమిటండోయి ఆతనికిపెళ్లయి రెండేళ్లయింది. నాకుపెళ్లయి మూడేళ్లయింది. పైగా వచ్చేయేడుకు ఆతను ఒకతండ్రికూడ అవుతా డనుకుంటున్నాము" అన్నాడు.

"పచ్చివాగుడు మానెయ్యి" అన్నాను. నిలువునా నీరయినాడు బ్రాహ్మడుపాపం. పైకిమాత్రం ఒక వికపునవ్వునవ్వాడు. మేంగూడా అది గ్రహించాము. రైలువచ్చింది మాటలో. ఎక్కాం 'శెలవు'అన్నాం 'చిత్తం' అన్నాడు. రామచంద్రపురంనుంచి సామర్ల కోటదాకా మూకిదేగోడవ.

*　　　*　　　*

"అయితే మధూ ఆ అమ్మాయిని పెళ్లిచేసుకోనా పాపం, బాగుందే దానిపాట" అన్నారు మావారు నవ్వుతూ. "నేను చాలనూ" అన్నాను నేను. 'ఊ' అని నవ్వుతూ నాచెంపలమీద రెండుచేతుల్తో రెండు వేసారు మెల్లిగా.

"మంచిసంబంధమే" అన్నా నేను నవ్వుతూ.

వాలిలాల మధుమతి.

భగ్నహృది

వాడిపోవని కుసుమాల వరుసలందు
గోలఁజేయుచు మధువును గ్రోలుచుండి
దివ్యసీమల మసలిన దినములవ్వి;
మనసదెంతటి మమకారమునకుచోటు;
కాకపోయిన నీవింతకానలోన
నేల యీగడ్డిపూవుల వ్రాలనిపుడు?

అదిలలితమై, ప్రమోదమై, అందరాని
సౌఖ్యపథముల నడపించు స్వర్గసీమ;
ఇదివిశీర్ణమై, భయదమై, మదినికలచు
కష్టముల కాకరంబగు కానసీమ.

వలపుపుట్టించు దివ్యసుమాలవేడ,
వాసనేలేని యీపూల పరుసయేడ;
మరచిపోలేని భాగ్యమ్ము మరలిపోవ
వెతలజీవింప నెంచుట వెర్రికాదె!

జి. వెంకటరమణమ్మ.